క్లుప్తంగా

'డయల్ యువర్ డీఎం'ను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : పులివెందుల ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959225780 ఈ నెంబరుకు ప్రయాణికులు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయాలన్నారు. అలాగే వాట్సప్ ద్వారా కూడా ఇదే నెంబరుకు తమ సమస్యలను మెసేజ్ రూపంలో తెలుపవచ్చునన్నారు. ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకే డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సింహాద్రిపురం : ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏవైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే మండలంలోని అగ్రహారంలో జూదం ఆడుతు ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12,610 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

పోటీ పరీక్షలకు ఆంగ్ల భాష తప్పనిసరి

ఎర్రగుంట్ల : ప్రస్తుతం పోటీ పరీక్షల్లో పట్టు సాధించాలంటే ఆంగ్లభాష తప్పనిసరని మండల విద్యాధికారులు శివప్రసాద్, వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం పట్టణంలోని రాణీవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల భాష గ్రంథాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. దేశవిదేశాలలో ఆంగ్లభాషలో నైపుణ్యం చాలా అవసరమన్నారు. విద్యార్థులు ప్రతి రోజు ఈ గ్రంథాలయంలో ఆంగ్లభాషపై పట్టుసాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రంగశైలజ, పాఠశాల కమిటీ చైర్మన్ సలీం, వైస్ చైర్మన్ ఏలియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, వైఎస్సార్ గవర్నమెంట్ జూనియర్ కళాశాల విద్యార్థినులు గురువారం పూలఅంగళ్ల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో విద్యార్థినులు నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళల పట్ల సమాజ దృక్పథం మారాలని, వారికి సరైన భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుధీర, బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ పీఓలు శ్రీనీత, శ్రీనివాసులురెడ్డి, నాగేంద్రమ్మ, స్నేహిత అమృతహస్తం కో ఆర్డినేటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ఆసుపత్రి



లింగాల : మండల కేంద్రంలోని 24గంటల పీహెచ్‌సీ ఆసుపత్రి అంధకారంలో ఉంది. రాత్రి పూట ఆసుపత్రిలో లైట్లు లేక మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా రోగులు ప్రమాదం జరిగి ఆసుపత్రికి వెళ్తే సెల్ లైట్ల ద్వారా వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతనెల రోజులుగా ఆసుపత్రిలోని లైట్లు కాలిపోవడంతో వాటిని తిరిగి అమర్చే నాథుడే కరువయ్యారు. ఆసుపత్రి కాంపౌండులో మాత్రం సిబ్బంది ఒకలైట్ కొని వెసుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని ఆసుపత్రిలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా విద్యుత్ వైర్లు

కమలాపురం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ స్తంభాల వద్ద విద్యుత్ వైర్లు అస్తవ్యస్తంగా, ప్రమాదకరంగా ఉన్నాయి. స్థానిక చౌక్ సెంటర్, కూరగాయల మార్కెట్, ఖాదరియా మస్జిద్, అమ్మవారిశాల ఎదుట ఉన్న విద్యుత్ స్తంభాల వద్ద విద్యుత్ వైర్లు గజిబిజిగా ఉన్నాయి. బస్టాండు సమీపంలోని ఎంపీపీ మెయిన్ పాఠశాల, జడ్పీ బాయ్స్, గర్ల్స్ హైస్కూల్స్‌లకు చౌక్ సెంటర్, మార్కెట్, ఖాదరియా మస్జిద్‌ల మీదుగా వందల మంది విద్యార్థులు వెళ్తుంటారు. గాలికి విద్యుత్ వైర్లు తెగి పడటం గాని, ఊడి పోయి ఊగటం గాని జరుగుతుంటాయి. ప్రమాదవశాత్తు ఈ విద్యుత్ తీగలు విద్యార్థులకు తగులు కుంటే ప్రమాదమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లి వస్తూ రెండు రోజుల క్రితం కడప నగరం అగాడి వీధిలో విద్యుత్ వైర్లు తగులుకుని ఒక విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఇలాంటి ఘటనలు జరగక ముందే విద్యుత్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలో రక్షణగోడలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉండటంతో ఆ ప్రాంత ప్రజలు ఆదోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కడపలో విద్యుత్ వైర్లు తగిలి ఒక విద్యార్థి మృతి చెందిన విషయం విధితమే. ప్రాణాలు పోయిన తర్వాత స్పందించడం కంటే సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ప్రహరీగోడ కానీ, కంచ గానీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.



పులివెందులలో రక్షణ గోడలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



కమలాపురంలో అమ్మవారిశాల ఎదుట అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వైర్లు



కమలాపురం : ఖాదరియా మస్జిద్ వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి అధికంగా ఉన్న కేబుల్ వైర్లు



కమలాపురం : కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు



చౌక్ సెంటర్‌లోని విద్యుత్ స్తంభానికి అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వేంపల్లె : మన చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. గురువారం మండలంలోని తాళ్లపల్లెలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. అనంతరం ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధుల గురించి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపువంటి వ్యాధులు వస్తాయన్నారు. లార్వా నిర్మూళన కొరకు ఫ్రైడే–డ్రైడేని పాటించాలని సూచించారు. పనికిరాని గుంతలను, లోతట్టు ప్రదేశాలను, వాడని బావులను పూడ్చి నీరు నిల్వలేకుండా చూడటం, చెత్తాచెదారం మురుగు కాల్వల్లో చేరకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త జ్యోతి, ఆశా కార్యకర్త, సుజాతలు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిద్దయ్య

నులిపురుగుల నివారణపై అవగాహన

పులివెందుల టౌన్ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణపై ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి నిర్వహించిన అవగామన కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య పాల్గొని మాట్లాడారు. నులిపురుగులు మన శరీరంలోకి బహిరంగ మలవిసర్జన, చెప్పులు లేకుండా తిరగడం, శుభ్రపరచని పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను తినడం, పరిశుభ్రమైన నీరు వాడకపోవడం ద్వారా జీర్ణాశయంలో స్థావరం ఏర్పరచుకుంటాయని, వీటి వలన బలహీనత, నీరసం, రక్తహీనత, ఎదుగుదల లేకపోవడం, చురుకుదనం లోపించడం, తరచుగా కడుపునొప్పి, విరేచనాలు, రక్త విరేచనాలు లాంటివి సంభవిస్తాయన్నారు. ఆరు నెలలకు ఒక్కసారి ప్రభుత్వం అందించే అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని, ప్రతి గురువారం అందించే ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త పుల్లమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య

నష్టపరిహారం అందించండి



వాహనాలు వెళ్లకుండా అడ్డంగా నిలబడ్డ రైతు



దుమ్ము, ధూళితో దెబ్బతిన్న మిరప పంట

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని వెలమవారిపల్లె కంకర మిషన్ సమీపంలో విజయవాడ–బెంగళూరు 6 లైన్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పులివెందులకు చెందిన మధుసూదన్‌రెడ్డికి చెందిన 5 ఎకరాల పొలాన్ని నారాయణస్వామి అనే వ్యక్తి గుత్తకు తీసుకుని మిరప పంట సాగుచేశాడు. పంటకు ఎరువులు, మందులకు రూ.లక్షలు ఖర్చు పెట్టాడు. అయితే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండటంతో దుమ్ము, ధూళి మిరప పంటపై పడటం వల్ల పంట దెబ్బతినిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దెబ్బతిన్న మిరప పంటకు సుమారు రూ.7 లక్షలు ఖర్చు చేసినట్లు రైతు తెలిపాడు. దెబ్బతిన్న పంటకు నష్టపరిహారం అందించాలని గురువారం 6 లైన్ రోడ్డుపై వెళ్తున్న వాహనాలకు రైతు అడ్డంగా నిలబడి నిరసన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు స్పందించి నష్టపోయిన మిరప పంటకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలి

కొండాపురం : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలకు ఇ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని వ్యవసాయ సహాయకులు వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం కొండాపురం రైతు భరోసా కేంద్రంలో కొండాపురం, సింహాద్రిపురం మండలంలోని రైతు భరోసా సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు పొలానికి వెళ్లి ఇ–క్రాప్ నమోదు చేయాలంటే అదే పొలంలోని సర్వే నెంబర్ అయితేనే ఇ క్రాప్ నమోదు చేసే కెమెరా ఆన్ అవుతుందని లేక పోతే కెమెరా ఆన్ కాదని వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలకు రైతు సేవా కేంద్రంలో ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. మండల వ్యవసాయ అధికారి ఏవీ రామాంజులరెడ్డి మాట్లాడుతూ మండలంలోని పంటలను సాగుచేసిన రైతులు తప్పకుండా ఇ–క్రాప్ నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తిస్తాయన్నారు.

నేటి నుంచి చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకలు

వల్లూరు : మండలంలోని పైడికాలువలో వెలసిన శ్రీ పునీత మరియ మాత మాతృత్వపు దేవాలయం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఈనెల 23వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు చర్చి ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కడప మేత్రాసనం పైడికాలువ విచారణలో వెలసిన పునీత మరియ మాత మాతృత్వపు దేవాలయం 1999 సంవత్సరం ఆగస్టు 13న అప్పటి కడప క్యాథలిక్ పీఠాధిపతియైన ఫాదర్ మల్లవరపు ప్రకాష్ చే ప్రతిష్ఠించబడింది. ఈ చర్చి ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించడానికి గ్రామ కథోలిక విశ్వాసులు, విచారణ గురువులు నిర్ణయించారు. ఈ క్రమంలో 23వ తేదీ నుంచి వేడుకలను నిర్వహించనున్నారు.

ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయండి

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీచేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ కోరారు. ఈ మేరకు విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారధి పేరుతో ప్రజల నుంచి వినతులు తీసుకునే కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డితో కలిసి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ని కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

వేంపల్లె : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నుంచి గ్రామ సభలు జరుగనున్నట్లు ఈఓపీఆర్డీ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద ఏఏ పనులు చేపట్టాలనే దానిపై గ్రామ సభల్లో చర్చిస్తారన్నారు. ఈ గ్రామ సభల్లో ప్రజలు పాల్గొని తమ పంచాయతీ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

లింగాల : మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ లోకేశ్వరరావు తెలిపారు. మండలంలోని 19 పంచాయతీ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎర్రగుంట్ల : మండలవ్యాప్తంగా శుక్రవారం అన్ని గ్రామాలలో గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ప్రత్యేక గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ రంతుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామ సభలన్నీ ఆయా గ్రామ సచివాలయాల్లో జరుగుతాయన్నారు. గ్రామ ప్రజలందరు గ్రామ సభలలో పాల్గొని వారి సమస్యలను తెలుపుకోవచ్చన్నారు.

వల్లూరు : ఉపాధి హామీ పనులు గుర్తించడంతో పాటు పారిశుధ్యం, తాగు నీరు వంటి అంశాలపై చర్చించి పనులను గుర్తించడానికి శుక్రవారం మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు.

ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు గోటూరు, తప్పెట్ల, 11 గంటలకు ది గువపల్లె, మాచిరెడ్డిపల్లె, పెద్దపుత్త, వల్లూరు, 12 గంటలకు ఆదినిమ్మాయపల్లె, కుమారునిపల్లె, మధ్యాహ్నం 3 గంటలకు అంబవరం, దుగ్గాయపల్లె, కొప్పోలు, కోట్లూరు, లేబాక, తోల్లగంగనప ల్లె, 3.30 గంటలకు పైడికాలువ, గ్రామ పంచాయ తీల్లో గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు.

కబ్జాకు గురైన కొండపోరంబోకు స్థలం

ఎర్రగుంట్ల : మండలంలోని చిన్నదండ్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పీ గోపులాపురం, కే గోపులాపురం గ్రామాల మధ్య ఉన్న కొండపోరంబోకు స్థలంను కొందరు కబ్జా చేశారు. గ్రామాల పరిధిలోని సర్వేనంబరు 849లో సుమారు 1247 ఎకరాలు కొండపోరంబోకు స్థలం ఉంది. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసమని ఈ స్థలంను అప్పట్లో ప్రభుత్వం ఆర్టీపీపీకి తీసుకున్నారు. ప్రస్తుతం నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఈ కొండపోరంబోకు స్థలంపై కొందరు కన్నేశారు. దీంతో మైలవరం దక్షణ కాలువ సమీపంలోనే కొండను తవ్వి రాళ్లను చదునుచేసి మట్టి తొలుకుని స్థలంను కబ్జా చేశారు. ఆ స్థలాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఆర్టీపీపీ అధికారులదే అని రెవెన్యూ అధికారులు అంటున్నారు. దీనిపై ఆర్టీపీపీ అధికారులు పట్టించుకోకపోవడంతో రెవెన్యూ అధికారులే రంగంలోకి దిగి తహసీల్దార్ శోభనబాబు ఆదేశాల మేరకు వీఆర్‌ఓ మల్లిఖార్జున కబ్జాకు గురైన స్థలంలో రెవెన్యూ నోటీసు బోర్డు ఏర్పాటు చేశారు.



కొండను చదును చేసిన ప్రాంతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన నోటీసు బోర్డు

జాగ్రత్తలతో సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ

వల్లూరు : తగిన ముందస్తు జాగ్రత్తలను తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాదుల నుంచి రక్షణ పొందవచ్చునని కమలాపురం ప్రభుత్వ హోమియోపతి వైద్యశాల మెడికల్ ఆఫీసర్ షాకీర్ హుస్సేన్ తెలిపారు. వల్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి మంగళ, గురు, శని వారాల్లో కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో వున్న ప్రభుత్వ హోమియో వైద్యశాలలో అందుబాటులో వుండి వైద్య సేవలిందిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రోగ నిరోధక శక్తిని పెంపొందించి సీజనల్ వ్యాధుల నివారణకు గానూ 240 మంది విద్యార్థినులకు ఆర్సెనిక్ ఆల్బమ్ 200 మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ నసీమున్నీసా పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ హోమియో వైద్యులు

అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వల్లూరు : మండలంలోని పాపాఘ్నినగర్ (కట్టుబస్టాపు) వద్ద గురువారం తెల్లవారుజామున 10 అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సంజీవ రాయుడు తెలిపారు. తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఎలాంటి అనుమతులు, పత్రాలు లేకుండా పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను లోడు చేసుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం పట్టుబడిన ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్లపై తదుపరి చర్యలకై రెవెన్యూ అధికారులకు నివేదించినట్లు ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలోని పాపాఘ్ని, పెన్నా నదుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డ ట్రాక్టర్లు

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తపేట గ్రామసమీపంలోని పాపాఘ్నినది నుంచి గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఎగువపల్లె క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకుని వాటిని సీజ్ చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

రక్తపరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలి

వేంపల్లె : జ్వరం భారిన పడిన వారికి రక్తపరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. గురువారం మండలంలోని తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. మలేరియా, డెంగీ కేసులు ఏమైనా నమోదయ్యాయా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలను సేకరించి వారానికి మూడుసార్లు ల్యాబ్‌కు అందజేయాలన్నారు. ఎవరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలన్నారు. ప్రజలు కూడా ఎప్పటికప్పుడు తమ పరిసరాల్లో శు భ్రత పాటించాలన్నారు.

వేముల : జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికి రక్తపరీక్షలు నిర్వహించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. గురువారం ఆయన వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఏవైనా కేసులు నమోదయ్యాయా అని ల్యాబ్ టెక్నీషియన్ జబీవుల్లాను అడిగి తెలుసుకున్నారు.

అధ్వానంగా ఏటీఎంలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సమీపంలో ఉన్న ఏటీఎం, మసీదు వద్ద ఉన్న ఏటీఎం, శ్రీరామాహాల్ బైపాస్ రోడ్డులో ఉన్న ఏటీఎంలలో ఏసీలు, సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పాటు చెత్తాచెదారాలతో అపరిశుభ్రంగా ఉన్నాయి. అలాగే ముద్దనూరు రోడ్డులో ఉన్న ఏటీఎంలు అయితే ఏసీలతో పాటు విద్యుత్ దీపాలు కూడా వెలగడంలేదని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటీఎంలలో సీసీ కెమెరాలు పనిచేస్తే చోరీలు జరిగినా దొంగలను పట్టుకోవచ్చు. అలాగే అన్ని ఏటీఎంలలో పేపర్లు చెత్త కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. సీసీ కెమెరాలు, లైట్ల చుట్టూ బూజు పట్టి అపరిశుభ్రంగా ఉన్నాయి. సంబంధిత బ్యాంకు అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదు.



ఏటీఎంలో పేరుకున్న చెత్త



ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో పనిచేయని ఏసీలు



పనిచేయని సీసీ కెమెరా



లైట్ల చుట్టూ బూజు పట్టిన దృశ్యం

వివాహ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు



నూతన వధూవరులతో వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక పాల్‌రెడ్డి కల్యాణ మండపంలో గురువారం జరిగిన వివాహ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. నూతన వధూవరులైన బ్రహ్మనీ, గణేష్‌లను పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, మాజీ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, జీసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లి కిషోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యపనులు చేపట్టండి

కొండాపురం : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్యపనులు చేపట్టాలని ఎంపీపీ లక్ష్మిదేవి తెలిపారు. గురువారం మండలంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను అదేశించారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులను క్లీన్ చేయించాలన్నారు. ఉపమండల అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి, ఎవో శ్రీనివాసులరెడ్డి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.